# సరిహద్దుల్లో పటిష్ట నిఘా ఏర్పాటుచేయాలి

- మద్యం, డబ్బులు, నిషేధిత పదార్థాలు రాష్ట్రంలోకి రాకుండా క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టాలి
- ఎన్నికల విధులను పకడ్బందీగా నిర్వహించాలి
- ఎస్పీ సింధూశర్మ
- నిజాంసాగర్, మద్నూర్, పిట్లం, పెద్దకొడప్‌గల్ పోలీస్‌స్టేషన్లను తనిఖీ చేసిన పోలీస్‌బాస్



సలాబత్‌పూర్ అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎస్పీ సింధూశర్మ

నిజాంసాగర్/ మద్నూర్/ పిట్లం/ పెద్దకొడప్‌గల్, అక్టోబర్ 17: తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా మహారాష్ట్ర, కర్ణాటకల నుంచి మద్యం, నగదు, ఇతర నిషేధిత పదార్థాలు, వస్తువులు జిల్లాలోకి రాకుండా చూసేందుకు జుక్కల్ మండలంలోని సోపూర్, మద్నూర్ మండలంలోని సలాబత్‌పూర్ వద్ద అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి పటిష్ట నిఘా ఏర్పాటు చేశామని ఎస్పీ సింధూశర్మ అన్నారు. ఆమె ముందుగా నిజాంసాగర్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. అనంతరం నర్సింగ్‌రావ్‌పల్లి చౌరస్తా వద్ద కామారెడ్డి-సంగారెడ్డి జిల్లాల సరిహద్దు ప్రాంతంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును తనిఖీ చేశారు. అనంతరం జుక్కల్ పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను తనిఖీ చేసి సోపూర్ వద్ద ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును క్షుణ్ణంగా పరిశీలించారు. ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేయాలని సిబ్బందికి ఆదేశించారు. చెక్‌పోస్టు వద్ద పక్కాగా తనిఖీలు చేయాలని ఆదేశించారు. ఆమె వెంట డీఎస్పీ జగన్నాథరెడ్డి, బాన్సువాడ రూరల్ సీఐ మురళి, ఎస్సైలు రాజశేఖర్, సత్యనారాయణ, మురళి తదితరులు ఉన్నారు.

మద్నూర్ మండలంలోని సలాబత్‌పూర్ అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టును ఎస్పీ సింధూశర్మ తనిఖీచేశారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మహారాష్ట్ర నుంచి నగదు, మద్యం, నిషేధిత పదార్థాలు తరలించకుండా ప్రతి వాహనాన్నీ క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సిబ్బందికి సూచించారు. చెక్‌పోస్టు వద్ద ఎంత మంది విధులు నిర్వహిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. అంతకుముందు మద్నూర్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ఆమె.. స్టేషన్‌లోని రికార్డులను తనిఖీ చేశారు. ఎస్పీ వెంట డీఎస్పీ జగన్నాథరెడ్డి, సీఐ కృష్ణ, ఎస్సై కృష్ణారెడ్డి, ఎంవీఐ సుభాష్, ఎక్సైజ్ ఎస్సై జనార్దన్ తదితరులు ఉన్నారు.

పిట్లం పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ సింధూశర్మ.. ఎన్నికల నిర్వహణ, బందోబస్తుపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎన్నికల విధులను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఆమె వెంట బాన్సువాడ డీఎస్పీ జగన్నాథరెడ్డి, బాన్సువాడ రూరల్ సీఐ మురళి, జిల్లా స్పెషల్ బ్రాంచ్ సీఐ చంద్రశేఖర్ రెడ్డి, పిట్లం ఎస్సై విజయ్‌కొండ, సిబ్బంది ఉన్నారు.

హైవేపై వాహనాల తనిఖీని పకడ్బందీగా చేపట్టాలని ఎస్పీ సింధూశర్మ పెద్దకొడప్‌గల్ పోలీసులకు సూచించారు. పెద్దకొడప్‌గల్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ఆమె.. పోలీసు సిబ్బందితో మాట్లాడారు. వాహనాల్లో డబ్బులు, నిషేధిత పదార్థాలు, మద్యం తరలిస్తే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఆవరణలో కొబ్బరి మొక్కను నాటారు. ఆమె వెంట బాన్సువాడ డీఎస్పీ జగన్నాథరెడ్డి, బిచ్కుంద సీఐ కృష్ణ, ఎస్సై కోనారెడ్డి, సిబ్బంది ఉన్నారు.



పెద్ద కొడప్‌గల్ పోలీస్‌స్టేషన్‌లో మొక్కను నాటుతున్న ఎస్పీ

## దొరికిన పర్సు బాధితుడికి అప్పగింత



బాధితుడికి పర్సును అప్పగిస్తున్న అజీజ్

నిజాంసాగర్, అక్టోబర్17: మండల కేంద్రానికి చెందిన అజీజ్, యాదగిరి ఇద్దరు మిత్రులు కలిసి ద్విచక్రవాహనంపై మాసన్‌పల్లి చౌరస్తా నుంచి మంగళవారం సాయంత్రం నిజాంసాగర్‌కు వస్తున్నారు. వీరికి రాజారాం దాబా సమీపంలో ప్రధాన రహదారిపై ఓ పర్సు దొరికింది. దానిని పరిశీలించగా.. అందులో రూ.8,500 నగదుతో పాటు ఏటీఎం, పాన్, లైసెన్స్, ఆధార్, క్రెడిట్ కార్డులు ఉన్నాయి. దీంతో వారు ఆ పర్సు నిజాంసాగర్ మండలంలోని ఆరేపల్లి గ్రామానికి చెందిన శేఖర్‌కు చెందినదిగా గుర్తించారు. ఆరేపల్లి గ్రామంలో బాధితుడి ఇంటికి వెళ్లి పర్సును అందజేశారు. విషయం తెలుసుకున్న స్థానికులు అజీజ్‌తోపాటు యాదగిరి నిజాయితీకి మెచ్చుకొని అభినందనలు తెలిపారు.

## మద్యం స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

సదాశివనగర్, అక్టోబర్ 17: మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామంలో రమేశ్‌గౌడ్ కిరాణా దుకాణంలో నిల్వ చేసి విక్రయిస్తున్న ఆరు లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నామని కామారెడ్డి ఎక్సైజ్ సీఐ విజయ్‌కుమార్, ఎస్సై విక్రమ్ తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. రమేశ్‌గౌడ్ తమ కిరాణా దుకాణంలో మద్యం విక్రయిస్తున్నాడనే పక్కా సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడిచేసినట్లు చెప్పారు. దుకాణంలో లభించిన ఆరు లీటర్ల మద్యం సీజ్ చేసి నిందితుడిని తహసీల్దార్ హిమబిందు ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు. గ్రామాల్లోని బెల్టు షాపుల్లో మద్యం విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది సంతోష్ తదితరులు ఉన్నారు.

# భిక్కనూరులో సైబర్ మోసం

- రూ.తొమ్మిది లక్షలు లూటీ
- పోలీసులకు ఫిర్యాదు

భిక్కనూరు, అక్టోబర్ 17: మండల కేంద్రంలో ఓ భారీ సైబర్ మోసం ఆలస్యంగా వెలుగు చూసింది. ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలకేంద్రానికి చెందిన గడ్డమీది ఓం ప్రకాశ్‌కు పాన్‌కార్డును అప్‌డేట్ చేస్తామని గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేశాడు. యాక్సిస్ బ్యాంకు ఖాతా లింకును పంపించి అందులో పాన్‌కార్డు వివరాలు నమోదు చేయించాడు. అనంతరం ఖాతాలో ఉన్నా నగదుతో పాటు రూ. 8 లక్షల 81 వేల 134 రుణం తీసుకొని వారి అకౌంట్లోకి బదిలీ చేసుకున్నారు. ఈ విషయాన్ని బాధితుడు గుర్తించి బ్యాంకుకు వెళ్లి తెలుసుకున్నాడు. సైబర్ మోసం జరిగినట్లు తెలుసుకొని వెంటనే 1930 నంబర్‌కు ఫోన్‌చేసి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

# కొనసాగుతున్న బతుకమ్మ సంబురాలు



తాడ్వాయి మండలం బ్రాహ్మణపల్లిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

సదాశివనగర్/ తాడ్వాయి, అక్టోబర్ 17: బతుకమ్మ సంబురాలు జిల్లావ్యాప్తంగా కొనసాగుతున్నాయి. మహిళలు, చిన్నారులు బతుకమ్మ సంబురాల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. సదాశివనగర్ మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ ఆధ్వర్యంలో మంగళవారం బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. అందంగా పేర్చిన బతుకమ్మలను అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో ఉంచి బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో టీచర్లు పైడి శశిరేఖ, పోతరాజు ఈదవ్వ, దాసరి బుజ్జి, ఎడ్ల బాల్‌నర్సవ్వ, కమ్మరి వాణి, మొగుళ్ల మంజుల, సరోజన, ఆయాలు సౌజన్య, లక్ష్మి, రాజవ్వ, విద్యార్థులు పాల్గొన్నారు.

తాడ్వాయి మండలంలోని బ్రాహ్మణపల్లి, తాడ్వాయి, కరడ్‌పల్లి, ఎర్రాపహాడ్, చిట్యాల తదితర గ్రామాల్లో బతుకమ్మ సంబురాలు కొనసాగుతున్నాయి. మహిళలు బతుకమ్మలను రంగురంగుల పూలతో అందంగా పేర్చి గ్రామంలోని ప్రధాన కూడళ్ల వద్ద ఉంచి పాటలు పాడుతూ.. లయబద్ధంగా ఆడుతున్నారు. అనంతరం స్థానిక చెరువులు, కుంటల్లో బతుకమ్మలను నిమజ్జనం చేస్తున్నారు.



సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డిలోని అంగన్‌వాడీ కేంద్రంలో..

# మంత్రి ప్రశాంత్‌రెడ్డికి పలువురి పరామర్శ

ఎల్లారెడ్డి/ నిజాంసాగర్/ సదాశివనగర్, అక్టోబర్ 17: రాష్ట్ర రోడ్లు భవనాల శాఖామాత్యులు వేముల ప్రశాంత్‌రెడ్డి తల్లి వేముల మంజులమ్మ ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. జడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు మంగళవారం వేల్పూర్‌లో మంత్రి నివాసానికి వెళ్లి మంజులమ్మ చిత్ర పటం వద్ద పూలు ఉంచి నివాళి అర్పించారు. ఆమె ఆత్మకు శాంతి కలుగాలని భగవంతుడిని ప్రార్థించారు. ఆయన వెంట గున్కుల్ సొసైటీ చైర్మన్ వాజిద్ అలీ, నాయకులు కాశయ్య, మహేందర్, ఇఫ్తాకర్ తదితరులు ఉన్నారు.

మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డిని నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండల కేంద్రంలోని ఆయన నివాసంలో ఎలారెడ్డి మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి నేరేళ్ల ఆంజనేయులు పరామర్శించారు. మంత్రి తల్లి మంజులమ్మ చిత్రపటం వద్ద పూలమాల ఉంచి నివాళులలర్పించారు. సదాశివనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కాట్యాడి రామారావు, యాచారం గిరిజన నాయకుడు లచ్చీరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.



మంజులమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జడ్పీమాజీ చైర్మన్ రాజు



మాజీ మంత్రి నేరెళ్ల ఆంజనేయులు తదితరులు

## నేడు మండల సమావేశం

పెద్ద కొడప్‌గల్, అక్టోబర్ 17: పెద్దకొడప్‌గల్ ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సూర్యకాంత్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి సభ్యులు, ఆయా శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.